ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ
జిల్లా వార్తలు

సోమవారం 8 డిసెంబరు 2025 | 5

గొల్లప్రోలులో
హిందూ సంఘాల ఆందోళన
- చర్చిలు మూసివేయాలని డిమాండ్
- ఆరుగంటల పాటు ఉద్రిక్త పరిస్థితులు
- తాత్కాలికంగా మూసివేతకు ఆదేశం

7

మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం: ఎస్పీ

- డ్రగ్స్ వద్దు బ్రో - సైకిల్ తొక్కుబ్రో నినాదంతో సైకిల్ ర్యాలీ
- పోలీసులకు 'ఫిట్ ఇండియా'

కాకినాడ క్రైం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు బానిసలు కాకుండా బంగారు భవిష్యత్తును మెరుగుపర్చుకుంటూ అందరికీ ఆదర్శప్రాయం కావాలని ఎస్పీ జి.బిందుమాధవ్ ఆకాంక్షించారు. కాకినాడ జిల్లాను మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఫిట్ ఇండియా, ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా అండ్ ఫోర్స్‌మెంట్(ఈగల్) కార్యక్రమ స్ఫూర్తితో మాదకద్రవ్యాలు లేని సమాజ నిర్మాణమే-సంకల్పంగా మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎస్పీ ఆధ్వర్యంలో ఆదివారం సైకిల్ ర్యాలీని నిర్వహించారు. కాకినాడ ఏఆర్ గ్రౌండ్స్‌నుంచి బాలాజీచెరువు వరకు డ్రగ్స్ వద్దు బ్రో - సైకిల్ తొక్కు బ్రో అనే నినాదంతో పెద్దఎత్తున ఈ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో విద్యార్థులు, ప్రజలు, సైక్లిస్టులు, పోలీసులు 800మంది పాల్గొన్నారు. అవగాహనతో మాదక ద్రవ్యాలను అంతమొందిద్దాం అనే స్వీయ సంకల్పంతో ఎస్పీ ప్రతిజ్ఞ చేశారు. జిల్లాను మాదక ద్రవ్యరహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా ప్రజలు ఫిట్‌గా ఉండేందుకు సైకిల్ తొక్కాలని పిలుపునిచ్చారన్నారు. మంచి దేహధారుడ్యంవల్ల మనస్సు ప్రశాంతంగా ఉండి వ్యసనాలకు దూరంగా ఉండే అవకాశం ఉందన్నారు. ఆకతాయితనంగా మత్తు కోసం తీసుకునే గంజాయి, డ్రగ్స్ మనిషి మెదడు, అవయవాల మీద పనిచేసి మరణానికి దారీ తీస్తాయని డ్రగ్స్‌కు అలవాటు పడితే క్రమంగా బానిసలుగా మార్చి మనిషి పతనానికి దారితీస్తుందన్నారు. పిల్లల నడవడికను, ప్రవర్తనను సరిచేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఎవరైనా గంజాయి వినియోగం, విక్రయం, అక్రమ రవాణా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే వెంటనే 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కి గానీ, డయల్ 112కు గానీ లేదా స్థానిక పోలీసుల దృష్టికి గానీ తీసుకురావాలని ఎస్పీ వెల్లడించారు. ఈ ర్యాలీలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, కాకినాడ ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్‌పాటిల్, ఎస్‌బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ వి.శ్రీహరి, సీఐలు, ఎస్ఐలు, సివిల్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



కాకినాడ నగరంలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్పీ బృందం

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టరేట్(కాకినాడ),డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన వెలువరించారు. జిల్లాస్థాయి అధికారులు విధిగా హాజరుకావాలన్నారు. పీజీఆర్ఎస్‌కు హాజరుకాలేని అభ్యర్థులు మీకోసం వెబ్‌సైట్‌లో తమ అర్జీలను నమోదు చేసుకోవాలన్నారు.

10శాతం రాయితీ

- ఆర్టీసీ ఏసీ సర్వీసుల్లో టికెట్లకు ఈనెల 20 వరకు అమలు

కార్పొరేషన్(కాకినాడ),డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్లాక్ సీజన్ సందర్భంగా కాకినాడ డిపోలోని దూరప్రాంత ఆర్టీసీ ఏసీ సర్వీసులకు ఈనెల 7 నుంచి 20 వరకు టికెట్ ధరలో 10శాతం రాయితీ ఇస్తున్నట్లు కాకినాడ ఆర్టీసీ డీఎం ఎంయువీ మనోహర్ ఆదివారం తెలిపారు.

ప్రతిరోజూ కాకినాడ ఆర్టీసీ డిపో నుంచి రాత్రి 7గంటలకు బీహెచ్ఇఎల్ నైట్ రైడర్ సీట్ టికెట్ ప్రస్తుత ధర రూ.1,350 రాయితీ ధర రూ.1,230, బెర్త్ ప్రస్తుత ధర రూ.1,560 రాయితీ రూ.1,420 రాత్రి 8గంటలకు బీహెచ్ఈఎల్ వెన్నెల ప్రస్తుతం ధర రూ.1,720 రాయితీ ధర రూ.1,560 రాత్రి 9గంటలకు బీహెచ్ఈఎల్ అమరావతి ప్రస్తుత ధర రూ.1,500 రాయితీ ధర రూ.1,360, సాయంత్రం 5గంటలకు కర్నూలు ఇంద్ర ప్రస్తుత ధర రూ.1,300 రాయితీ ధర రూ.1,190, సాయంత్రం 6గంటలకు తిరుపతి ఇంద్ర ప్రస్తుతం ధర రూ.1,470 రాయితీ ధర రూ.1,340, మధ్యాహ్నం 2.45 గంటలకు బెంగళూరు అమరావతి ప్రస్తుత ధర రూ.2,570 రాయితీ రూ.2,330గా ఉంటుందని డిపో మేనేజర్ తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విలపింఛన్!

కొత్త పింఛన్లు ఇంకెప్పుడో..



ఈమె గత బుధవారం ఒడిలో ఉన్న కుమార్తె పింఛను నిమిత్తం అడిగేందుకు నల్లజర్లలో జరిగిన సీఎం చంద్రబాబు సభకు వచ్చారు..

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ రాయుడుపాకలకు చెందిన మాచవరపు రిత్వికా గ్రేస్‌కు ఆరేళ్లు. దివ్యాంగురాలు.. రెండు కాళ్లు పనిచేయవు.. తరచూ పిట్స్ వస్తుంటాయి.. బ్రెయిన్ డ్యామేజీ ఉంది.. దీంతో సదరం సర్టిఫికెట్‌లో 100 శాతం ఇచ్చారు.. బాలిక తండ్రి చిరు ప్రైవేట్ ఉద్యోగి.. గత నాలుగేళ్లగా దివ్యాంగ పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు.. నేటికీ నమోదు కాలేదు. కూటమి ప్రభుత్వంలో తప్పనిసరిగా పింఛన్ మంజూరవుతుందని అనుకున్నాడు.. ఈ ప్రభుత్వంలోనూ ఇదే పరిస్థితి. తమ కుమార్తెకు దివ్యాంగ పింఛన్ ఎప్పుడు మంజూరవుతుందో.. ఎప్పుడు తమ కష్టాలు తీరతాయోనని ఎదురుచూపులు చూస్తున్నారు...

కాకినాడకు చెందిన యాళ్ల లలితకు ప్రస్తుతం ఏడేళ్లు. మానసిక, శారీరక వికలాంగురాలు..సదరం సర్టిఫికెట్‌లో వంద శాతం ఇచ్చారు.. బాలిక తండ్రి తాపీ పని చేస్తుంటా డు.. గత ఐదేళ్లగా దివ్యాంగ పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేం దుకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నా డు.. నేటికీ నమోదు కాలేదు.కూటమి ప్రభుత్వంలోనైనా పిం ఛన్ మంజూరవుతుందని అనుకున్నాడు..ఇప్పుడూ ఇదే పరిస్థితి.

కాకినాడలోని దుమ్ములపేటకు చెందిన కృష్ణవర్ధన్‌కు నాలుగేళ్లు. డ్రోన్ సిండ్రోమ్‌తో బాధపడుతున్నాడు. సదరం సర్టిఫికెట్‌లో 80 శాతం ఇచ్చారు..తండ్రి ఆటోడ్రైవర్. అం తంతమాత్రమే ఆదాయం. గత మూడేళ్లగా పింఛన్‌కు దరఖాస్తు చేస్తూనే ఉన్నాడు.దరఖాస్తులకు వం దల్లో ఖర్చవుతుంది కానీ నేటికీ ఫలితం లేదు. ప్రభుత్వ కార్యాల యాల చుట్టూ తిరుగుతున్నా పరిస్థితిలో మార్పు లేదు. దీంతో లబోదిబోమంటున్నారు.

- నోటిఫికేషన్‌కు ఎదురుచూపులు
- కూటమి ప్రభుత్వం రాకతో ఆశలు
- 17 నెలలైనా స్పందన రాక లబోదిబో
- వెల్లువలా దరఖాస్తులు, వినతులు

సామర్లకోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పడి 17 నెలలైంది.. నేటికీ కొత్త పింఛన్లకు దరఖాస్తులు స్వీకరించడంలేదు. దీంతో వేలాది మంది లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల కొత్త పింఛన్లకు దరఖాస్తులు స్వీకరించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చీ రావడంతోనే పింఛను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచింది. కొందరికి ప్రత్యేకంగా రూ.15 వేలు పింఛను అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో పింఛనుకు ఎక్కడ లేని డిమాండ్ వచ్చిప డింది. దీంతో దరఖాస్తుదారులు పెరిగారు. కూటమి ప్రభుత్వంలో వెంటనే దరఖాస్తులు స్వీకరిస్తుందని లబ్ధిదారులు ఆనుకున్నారు.కానీ అలా జరగలేదు. దీంతో ప్రభుత్వం నుంచి స్పందనకు ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారు 60 వేల మంది వరకూ కొత్త పింఛన్లకు అర్హులు ఉన్నట్లు సమాచారం.

ప్రస్తుత పింఛన్లు ఇవే..

జిల్లా	లబ్ధిదారులు	సొమ్ములు
కాకినాడ	2,71,360	117.81 కోట్లు
కోనసీమ	2,36,284	101.86 కోట్లు
తూర్పు	2,35,060	103.27 కోట్లు

నాడు అలా.. నేడు ఇలా..

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పింఛన్ల నమోదు ప్రక్రియ నిరంతరంగా జరిగేది. వారం వారం దరఖాస్తులను పరిశీలించి నెలాఖరుకు జాబితా సిద్ధం చేసే వారు. ఫలితంగా అర్హులైన లబ్ధిదారులకు ఆ మరుసటి నెల నుంచే పింఛను పొందే అవకాశం కలిగేది. గత వైసీపీ ప్రభుత్వం ఈ విధా నానికి స్వస్తి చెప్పింది. ఆరు నెలలకోసారి మాత్రమే లబ్ధిదారుల జాబితా రూపొందించే విధానాన్ని తెరమీదకు తెచ్చింది. ఏటా జూన్, డిసెంబరు నెలల్లోనే జాబితా రూపొందిస్తామని చెప్పింది.గడచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆరు నెలలకు జాబితా రూపొందించిన దాఖలాల్లేవు. కూటమి ప్రభుత్వంలో పాతపద్ధతిలో ప్రతినెలా పింఛను దరఖాస్తుల ప్రక్రియ ఉంటుందని భావించినా ఊసేలేదు.

పెండింగ్‌లో 30 వేల దరఖాస్తులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధి సచివాలయాల్లో నవంబరు 20 నాటికి సుమారు 30 వేల నూతనంగా పింఛన్లకు దరఖాస్తులు ఉన్నట్టు సమాచారం. వీటిలో కనీసం 24 వేల మందికైనా పింఛను అర్హత ఉంటుందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 7,42,704 పింఛనుదారులకు ప్రతి నెలా రూ.322.94 కోట్ల మేర సొమ్ములను ప్రతి నెలా చెల్లిస్తున్నారు.ప్రభుత్వం ఇప్పటి వరకూ ఉన్న దరఖాస్తులకు మంజూరు లభిస్తే ప్రభుత్వానికి అదనంగా మరో రూ.12 కోట్ల మేర భారం కానున్నట్టు అంచనా.



మా వైపు చూడండి సార్ : పవన్‌కు దివ్యాంగుల షేక్ హ్యాండ్(ఫైల్)

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

- జిల్లాలో గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1కి 28మందికి అర్హత

సామర్లకోట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని వివిధ పంచాయతీల్లో గ్రేడ్-2 కార్యదర్శులుగా పనిచేస్తున్న వారికి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు కల్పిస్తూ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్‌నుంచి అందరికీ ఉత్తర్వులు అందాయి. పదోన్నతులు పొందినవారిలో సామర్లకోట మండలం నవరకు దడాల నాగమహేష్, వీకే రాయపురానికి ఊబా నిర్మలాదేవి, ఉండూరుకు ఎస్‌డీకే మణికుమార్, పెద బ్రహ్మదేవానికి ఆడారి భారతి.. కాగా, రాంబాబు చొప్పెర్ల, కాసు ఉషారాణి, స్వామిరెడ్డి చినజగ్గారావు, యాసలపు ఉమామహేశ్వరరావు, పాలెపు నాగమణి, ముత్యాలు వరలక్ష్మి, కొల్ల సరళాదేవి, పినిశెట్టి ఉమామహేశ్వరరావు, కలగల రాజబాబు, దంగేటి ప్రతాప్, బోనగిరి దుర్గాభవాని, మాగాపు వీరలక్ష్మి, పులపకూరి మహాలక్ష్మి, గుడివాడ నాగన్నదొర, బండి రాజేంద్రకుమార్, చిట్టూరి దుర్గాభవాని, కలిదిండి అనంతలక్ష్మి, మళ్ల శివబాబు, ముత్యాల రామ్మోహనచౌదరి, శీలంశెట్టి రాజ్, తొగరు వీరవెంకటసత్యనారాయణ, మండలీక వీఎస్ఎస్ఎన్ సురేష్, పోల్నాటి సురేష్, అప్పన్న వెంకటగోవిందు ఉన్నారు. వీరంతా ప్రస్తుతం పనిచేస్తున్నచోట రిలీవ్ అయ్యి పదోన్నతులు కల్పించిన పంచాయతీల పరిధిలోని ఎంపీడీవోల ఎదుట హాజరుకావాలని డీపీవో ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సాగర తీరంలో సందర్శకుల సందడి



ఎన్టీఆర్ సాగర తీరంలో సందర్శకులు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ సూర్యారావుపేట సాగరతీరం ఆదివారం సందర్శకులతో కిక్కిరిసింది. ఎన్టీఆర్ బీచ్, సూర్యారావుపేట, నేమాం బీచ్‌ని సందర్శించేందుకు వేలసంఖ్యలో చిన్నారులు, విద్యార్థులు, యువత తరలివచ్చారు. ఆటపాటలు, కేరింతలతో ఉత్సాహంగా గడపారు. యువతీ, యువకులు సముద్రస్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. యుద్ధ విమానం ఎక్కి ఆనందంగా గడిపారు. వాకలపూడి మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఆదేశాలమేరకు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

రబీ సాగుకు.. నీరందేది ఎలా?



ఏలేరు వరదలకు పిఠాపురంలో పడిన గండ్లు(ఫైల్)

- గండ్లు పూడ్చివేతకు నిధులు నిల్
- నేటికీ విడుదల చేయని ప్రభుత్వం
- పనులు చేయకుంటే పంటపొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం
- శాశ్వత పనులకు రూ.21.38 కోట్లు, తాత్కాలిక పనులకు రూ. 2.49కోట్లు అవసరమని నివేదన
- మూడు రోజుల్లో ఏలేరు నీరు వదిలే అవకాశం

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

రబీ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే నారుమడులు వేసేందుకు వీలుగా పొలాలను దుక్కి దున్ని సిద్ధంచేశారు. గోదావరి జలాలు పీబీసీ కాలువకు విడుదల కాగా, ఏలేరు రిజర్వాయర్ నుంచి మరో మూడు రోజుల్లో వదలనున్నారు.ఏలేరు వరదలకు కారణంగా ఏలేరు, పీబీసీ, పంపాకాలువలకు పడిన గండ్లు పూడ్చేందుకు, బలహీనపడిన గట్లను పటిష్ట పరిచేందుకు నేటివరకూ నిధులు విడుదల చేయకపోవడం రైతులను కలవరానికి గురిచేస్తోంది.

రబీ(దాళ్వా) సాగుకు సమయం ఆసన్నమైనా రైతుల్లో ఆందోళన వెన్నాడుతూనే ఉంది. వరదల కారణంగా పడిన గండ్లు పూడ్చే, కోతకు గురైన గట్లు పటిష్ట పరిచే పనులు ఇంతవరకూ ప్రారంభం కాకపోవడమే ఇందుకు కారణం. ఏలేరు, పీబీసీ కాలువలు పటిష్టంగా ఉన్న ప్రాంతాల్లో రైతులు నారుమడులు వేసేందుకు సిద్ధం కాగా గండ్లు పడిన ప్రాంతాల్లో రైతులు పనులు చేసిన తర్వాతే సాగు ప్రారంభించాలని భావిస్తున్నారు. మొంథా తుపాన్ ప్రభావం, ఏలేరుకు సంభవించిన వరదలతో ఏలేరు, పీబీసీ, పంపా కాలువలకు గండ్లు పడ్డాయి. పలుచోట్ల గట్లు కోతకు గురై బలహీనంగా మారాయి. కళింగల్స్, రెగ్యులేటర్ల గేట్లు, బల్లలు దెబ్బతిన్నాయి. ఏలేరు వరద తగ్గుముఖం పట్టినా 20రోజులపాటు ఈ గండ్ల నుంచి నీరు ప్రవహిస్తూనే ఉంది. ఏలేరు రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను పూర్తిగా నిలిపివేయడంతో రైతులు వరి కోతలు, మాసూళ్లను పూర్తి చేసుకోగలిగారు.

గండ్లు ఎక్కడెక్కడ

ఏలేరు వరదలు, మొంథా తుపాన్ ప్రభావంతో కిర్లంపూడి, గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి, సామర్లకోట, తొండంగి మండలాల పరిధిలో ఏలేరు, పీబీసీ, పంపా పరిధిలోని కాలువలకు భారీనష్టం జరిగింది. వీటి కారణంగా కిర్లంపూడి మండలంలోని ముక్కోలు, రాజుపాలెం, సోమరాయునిపేట, చిల్లంగి తదితర ప్రాంతాల్లో 27చోట్ల గండ్లు పడడం, గట్లు కోతకు గురైనట్లు ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. గొల్లప్రోలు, పిఠాపురం పరిధిలో గొల్లప్రోలు కాలువ, పిడిందొడ్డి, బల్లకట్టు, నక్కలఖండి, నడిమేరు ప్రాంతాల్లో పదిచోట్ల గండ్లు పడడం, గట్లు జారిపోవడం జరగ్గా కొత్తపల్లి మండలం రమణక్కపేటవద్ద ఒక చోట, సామర్లకోట మండలంలో రెండుచోట్ల, తొండంగి మండలంలో వజ్రకూటం, తొండంగి గ్రామాల్లో పంపాకాలువలకు మూడుచోట్ల, పెదపూడి మండలం చింతపల్లి వద్ద గోదావరి కాలువకు ఒకచోట గండి పడినట్లు గుర్తించారు. మొత్తం 44చోట్ల గండ్లు పూడ్చడం, కోతకు గురైన, జారిపోయిన గట్లుకు అత్యవసరంగా మరమ్మతులు చేపట్టేందుకుగాను రూ.2.49కోట్ల వ్యయం అవుతుందని ఇవే పనులను శాశ్వత ప్రాతిపదికన చేపట్టేందుకు రూ.21.39కోట్లు అవసరమవుతుందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేశారు.

నెలరోజులైనా..

వరదలు, తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టాన్ని తక్షణం నివేదించాలని ప్రభుత్వంనుంచి ఆదేశాలు రావడంతో వరద తగ్గుముఖం పట్టగానే ఇరిగేషన్ అధికారులు అంచనాలు తయారు చేసి నివేదించారు. తాత్కాలికంగా పనులు చేపట్టేందుకు అవసరమయ్యే నిధులు, శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు ఎంత మేర నిధులు అవసరమవుతాయో అందులో సమగ్రంగా వివరించారు. నెలరోజులు దాటినా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి విడుదల కాలేదు. ఈ పనులు చేపట్టకుండా రబీ సాగుకు నీరు విడుదల చేస్తే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఇందులో అత్యవసరంగా ఇసుకబస్తాలను అడ్డుకట్టలుగా వేసే పనులకు రూ.39లక్షలు అవసరమవుతాయని అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. గతేడాది ఏలేరు వరదలకు 280కిపైగా ప్రాంతాల్లో గండ్లుపడగా 100గండ్లను మాత్రమే పూడ్చారు. దీంతో కొన్నిచోట్ల రైతులే సొంత సొమ్ములతో ఇసుకబస్తాలు వేయడం వంటి పనులు నిర్వహించు కుని సార్వా సాగుకు ఇబ్బంది లేకుండా చూసుకున్నారు. అత్యవసరంగానైనా పనులు చేపట్టి రబీ సాగుకు ఇబ్బంది లేకుండా చూడాలని వారు కోరుతున్నారు.

అంధకారంలో బోట్‌క్లబ్ పార్కు

- నిర్వహణ పట్టని కార్పొరేషన్ అధికారులు
- పట్టించుకోవాలని కోరుతున్న స్థానికులు



లైట్లు వెలగక చీకటిమయంగా మారిన బోట్‌క్లబ్ పార్కు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ బోట్‌క్లబ్ పార్కులో విద్యుత్తు దీపాలు వెలగక అంధకారం నెలకొంది. బోట్‌క్లబ్ నిర్వహణపై కాకినాడ కార్పొరేషన్ అధికారుల పర్యవేక్షణ లోపించడంతో అస్తవ్యస్తంగా మారింది. నిర్వహణ విషయంలో 16 నెలల బిల్లులను కాంట్రాక్ట్ ఏజెన్సీకి కార్పొరేషన్ అధికారులు చెల్లించకపోవడంతో ఈనెల 1నుంచి సదరు కాంట్రాక్టర్ బోట్‌క్లబ్ నిర్వహణా బాధ్యతలనుంచి పక్కకు తప్పుకున్నారు. దీంతో పార్కులో పరిసరాలు శుభ్రం చేసే పని,మొక్కలకు నీరు పోయడం, విద్యుత్తు లైట్లు వేయడం వంటి బాధ్యతలు తాత్కాలికంగా సిబ్బంది అప్పగించి చేతులు దులుపుకున్నారు. కుటుంబసభ్యులు, రిటైర్డు ఉద్యోగులు, ప్రజలు సందర్శకులతో ఆనందంగా గడిపేందుకు ఉదయం, సాయంత్రం కాకినాడ-పిఠాపురం ప్రధాన రహదారిలో ఒకటో డివిజన్ పరిధిలోని ఈ పార్కుకు వేలాదిమంది వస్తుంటారు. ఐదేళ్లగా కాకినాడ కార్పొరేషన్ పరిధిలోని ప్రధానపార్కుల నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించింది. ఇందులోభాగంగా బోట్‌క్లబ్ పార్కు నిర్వహణ బాధ్యతలను ఓ కాంట్రాక్ట్ సంస్థకు 2024, ఏప్రిల్‌లో అప్పగించారు. నిత్యం పగలు, రాత్రి గస్తీ కాసేందుకు ఆరుగురు సెక్యూరిటీ సిబ్బంది, పార్కులోని మొక్కలకు నీరు, పరిసరాల పరిశుభ్రత, విద్యుత్తు లైట్లు వేసేందుకు 16మంది సేవలు అందించేవారు. కాంట్రాక్టర్‌కు కార్పొరేషన్ అధికారులు బిల్లుల చెల్లించకపోవడంతో నవంబరు నెలాఖరు వరకు కొనసాగి సిబ్బందిని కొనసాగించలేక చేతులెత్తేశారు. దీంతో డిసెంబరు 1నుంచి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒకరిద్దరి సిబ్బందితో బోట్‌క్లబ్‌పార్కును నిర్వహిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక సాయంత్రం, తెల్లవారుజామున బోట్‌క్లబ్‌లో విద్యుత్తు లైట్లు వేసే వారు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని సందర్శకులు ఆవేదన వ్యక్తం చేశారు. లైట్లు లేక బోట్‌క్లబ్ అంతా అంధకారంలో ఉందని, చీకట్లో విషసర్పాలు సంచరిస్తున్నాయని, తక్షణమే బోట్‌క్లబ్‌లో లైట్లు వేసేందుకు సిబ్బందిని నియమించాలని వారు కోరుతున్నారు.

రూ.వెయ్యికోట్ల స్థలం..
కొట్టేసే ప్రయత్నం



వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే వనమాడి

- కోర్టు డిక్రీ ఇచ్చిందంటూ కొందరి ప్రచారం
- అది ప్రభుత్వ స్థలం: కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి

కాకినాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాకినాడలో భూకబ్జాలపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. మొన్నటికి మొన్న కాకినాడ పల్లంరాజునగర్ సమీపంలో గ్రీన్‌బెల్ట్ కోసం కేటాయించిన రూ.5కోట్ల విలువ చేసే వెయ్యి గజాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల చెర నుంచి విడిపించగా.. రూ.వెయ్యికోట్ల విలువ జేసే 19 ఎకరాల స్థలం ఆక్రమణ విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు) మీడియా ప్రతినిధులకు వెల్లడించారు. కాకినాడ-పిఠాపురం రహదారిలోని రంగరాయ వైద్యకళాశాల ఎదురుగా ఉన్న సాంఘిక సంక్షేమశాఖకు చెందిన స్థలానికి చేర్చి ఉన్న 19 ఎకరాల స్థలం కబ్జాకు కొందరు యత్నిస్తున్నట్టుగా తెలిసిందన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వస్థలమని, ఇక్కడ కొన్నేళ్లగా ఆనందనిలయం పేరుతో సాంఘిక సంక్షేమశాఖకు చెందిన వసతిగృహం నిర్వహిస్తున్నారని, దీనిలో 100మందికిపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. ఈస్థలం ఆక్రమణకు కొందరు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టుగా తమదృష్టికి వచ్చిందన్నారు. ఈ స్థలాన్ని విక్రయిస్తామంటూ బేరసారాలు పెడుతున్నారని, ఎవరూ ఈ స్థలాన్ని కొనుగోలు చేసి చిక్కుల్లో పడవొద్దని సూచించారు. ఈ సమస్యను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు చెప్పారు. ఈ ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్టు ఆయన వివరించారు.

అసలేం జరిగింది?

కాకినాడ రంగరాయ వైద్యకళాశాల ఎదురుగా ఆనందనిలయం పేరుతో సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహం నిర్వహిస్తోంది. రెండెకరాల స్థలంలో వసతిగృహంతోపాటు కళాశాల విద్యార్థులకోసం మరో వసతిగృహభవన నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. ఈభూమి 30ఎకరాలు ఉంటుంది. ఇది గతంలో పిఠాపురం మహారాజా వారి సంస్థానానికి చెందినది. 1910లో రాజావారు పదెకరాలు రంగరాయ వైద్యకళాశాలకు, మరో 19ఎకరాల్లో ఒక ఎకరం భూమిని అనాథ పిల్లల ఉచిత పోషణకు కేటాయించారు. మిగిలిన 18 ఎకరాల్లో వచ్చిన ఫలసాయం ద్వారా వచ్చే ఆదాయంతో విద్యార్థుల వసతిగృహాన్ని నడిపేలా కేటాయించారు. 1948లో కేంద్రప్రభుత్వం ద్వారా ఎస్టేట్ ఎబోలిసన్ యాక్ట్ రాగా, ఈ చట్టాన్ని అనుసరించి 1949, సెప్టెంబరులో ఆ హాస్టల్‌తోపాటు భూమి 30ఎకరాలు అప్పటి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దానికి అప్పట్లో పిఠాపురం మహారాజా కూడా అంగీకారం తెలిపారు. అనంతరం ఆయన వారసులు కొందరు భూమిపై లిటిగేషన్ సృష్టించగా ప్రభుత్వం 1961లో చట్టప్రకారం ఈ భూమి, హాస్టల్ మొత్తం ప్రభుత్వానిదేనని నిర్ణయించి ఉత్తర్వులు ఇచ్చింది. అప్పటినుంచి ఆ భూమి ప్రభుత్వస్వాధీనంలో ఉన్నట్టు రికార్డులు చెప్తున్నాయి. మరోవైపు ఈ భూమిపై కన్నేసిన కొందరు అక్రమంగా స్వాధీనం చేసుకోవాలని కోర్టు కేసులు వేశారు. కానీ, దీన్ని విక్రయించేందుకు ఎవరికీ అర్హత లేదు. ఇటీవ ల ఈ భూమిని కొందరు కోర్టు ద్వారా తమకు సంక్రమించినట్టుగా పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఈ భూమికి సంబంధించిన లావాదేవీలు, విక్రయాలు చేపట్టేలా కోర్టు డిక్రీలు పొందినట్టుగాను ప్రకటనలు చేస్తున్నారు. ఈ విషయం తెలిసిన సిటీ ఎమ్మెల్యే.. ప్రభుత్వ అధీనంలో ఉన్న విలువైన భూమిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారు.



సన్‌డే.. ఫన్‌డే..

అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జలపాతం వద్దకు ఆదివారం అధికసంఖ్యలో తరలివచ్చారు. ప్రకృతి అందాలు ఆస్వాదిస్తూ స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు.

- మోతుగూడెం (ఆంధ్రజ్యోతి)

ప్రకృతి అందాలను ఆస్వాదిస్తాం..

పాపికొండలకు 13 బోట్లలో 900 మంది పర్యాటకులు



పోశమ్మ గండి వద్ద బోటు ఎక్కేందుకు సిద్ధంగా ఉన్న పర్యాటకులు



పర్యాటకులతో పాపికొండలకు వెళ్తున్న బోటు

దేవీపట్నం/వీఆర్‌పురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాపికొండల అందాలను ఆస్వాదించేందుకు తెలుగు రాష్ట్రాలు నలుమూలల నుంచి ఆదివారం 13 పర్యాటక బోట్లల్లో సుమారుగా 900 మంది పర్యాటకులు వెళ్లారు. దీంతో పోశమ్మ గండి వద్ద, పోచవరం ఫెర్రి పాయింట్ దగ్గర పేరంటాలపల్లి శివాలయం (మునిమఠం) వద్ద పర్యాటకులతో పండుగ వాతావరణం ఏర్పడింది. గోదావరి ముంపు పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, దేవీపట్నం, తొయ్యేరు. మూలపాడు, అగ్రహారం, మడిపల్లి, మంటూరు, కచ్చులూరు, తాళ్లూరు, గొందూరు, సుద్దకొండ, తెలిపేరు, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా పేరంటాలపల్లి చేరుకున్నారు. శివాలయంలో శివుడిని దర్శించుకుని ఆ గ్రామంలో గిరిజనులు తయారుచేసిన వెదురు బొమ్మలను కొనుగోలు చేశారు. ముందుగా ఆ గ్రామ పరిధిలో ఉన్న జలపాతాల వద్ద సందడి చేశారు.



భక్తుడు సమర్పించిన నక్లెస్

సత్యదేవుడికి నక్లెస్ బహూకరణ

అన్నవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరంలో సత్యదేవుడి దేవేరి అనంతలక్ష్మి అమ్మవారి అలంకరణ నిమిత్తం ఆదివారం ఒక భక్తుడు నక్లెస్‌ను విరాళంగా అందజేశారు. నంద్యాల జిల్లాకు జనపల్లి గ్రామానికి చెందిన సి.రాముడు దీనిని ఈవో సుబ్బారావు, అకౌంట్స్‌విభాగ సూపరింటెండెంట్ యనమల అప్పారావు సమక్షంలో అందజేశారు. దీనిబరువు 24.8 గ్రాములుండగా కేవలం బంగారం 8.9 గ్రాములు ఉందన్నారు. ఇతర స్టోన్స్ విలువను లెక్కకట్టమని.. నికర బంగారం విలువ సుమారు రూ.1.05 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా దాతను ఈవో అభినందించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



ఈవో సుబ్బారావుకు నక్లెస్‌ను అందజేస్తున్న దాత

వంద పువ్వులే... వికసించెలే..

కొత్తపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన పురోహితుడు పెద్దింటి రామం ఇంటి పెరటిలో వేసిన బ్రహ్మకమలం మొక్కకు ఒకేసారి 100 పువ్వులు వికసించడంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రామం ఈ మొక్కను 4 సంవత్సరాల కితం చెన్నై నుంచి ప్రత్యేక తెప్పించుకున్నారు. గత నాలుగేళ్లలో ఇప్పటి వరకూ 5వేల వరకూ పువ్వులు వికసించాయని, ఆదివారం 100 పుష్పాలు వికసించాయన్నారు. ప్రతిరోజు భక్తిశ్రద్ధలతో సంరక్షణ చేయడంతో ఆరోగ్యకరంగా మొక్క పెరిగి పుష్పాలతో విరబూస్తుందని, ఇది శుభసూచికమని తెలిపారు.



క్రీడాకారులు లక్ష్యాలను సాధించాలి

- 'నన్నయ' వీసీ ప్రసన్నశ్రీ
- మహిళా బాస్కెట్‌బాల్ అంతర్ కళాశాలల పోటీలు, యూనివర్శిటీ జట్టు ఎంపికలు

దివాన్‌చెరువు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. విశ్వవిద్యాలయంలో మహిళా బాస్కెట్ బాల్ అంతర్ కళాశాలల పోటీలు, యూనివర్సిటీ జట్టు ఎంపికలు ఆదివారం నిర్వహించారు. హాజరైన వీసీ మాట్లాడుతూ క్రీడల ద్వారా నన్నయ విశ్వవిద్యాలయం ఔన్నత్యాన్ని జాతీయస్థాయిలో చాటిచెప్పే విధంగా కృషి చేయాలన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల నుంచి 8 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను విశ్వవిద్యాలయం జట్టుగా ఎంపిక చేశారన్నారు. ఈనెల 29 నుంచి వచ్చే నెల 2 వరకూ బెంగుళూరులోని క్రిస్ట్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ మహిళా బాస్కెట్‌బాల్ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని తెలిపారు. మహిళా బాస్కెట్ బాల్ అంతర్ కళాశాలల పోటీల్లో మొదటి స్థానం ఏలూరులోని సెయింట్ థెరిస్సా, రెండోస్థానం ఏలూరులోని సీఆర్‌ఆర్ కళాశాల, మూడోస్థానం ఆదిత్య మహిళా కళాశాల క్రీడాకారులు సాధించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.వి.వి.ఎస్.ఎన్.మూర్తి, విశ్వవిద్యాలయం అధికార్లు, అధ్యాపకులు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన నన్నయ విశ్వవిద్యాలయం బాస్కెట్ బాల్ జట్టుతో వీసీ ప్రసన్నశ్రీ, అధికారులు

గొల్లప్రోలులో హిందూ సంఘాల ఆందోళన

- చర్చిలు మూసివేయాలని డిమాండ్
- ఆరుగంటల పాటు ఉద్రిక్త పరిస్థితులు
- తాత్కాలికంగా మూసివేతకు ఆదేశం
- పోలీసు పికెట్ ఏర్పాటు



ఆందోళనకు దిగిన హిందూ సంఘాల ప్రతినిధులు

గొల్లప్రోలు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులో హిందూ సంఘాల ఆందోళన, అదే సమయంలో చర్చిల వద్దకు వెళ్లేందుకు క్రైస్తవులు ప్రయత్నించడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. పోలీసు బలగాలు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. చర్చిలో కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆర్డీవో ఆదేశించారు. సుమారు ఆరుగంటల పాటు ఆందోళనలు, ఉద్రిక్తతలు కొనసాగాయి.

అసలేం జరిగిందంటే...

గొల్లప్రోలు కొత్తపేట ప్రాంతంలో ఉన్న రెండు చర్చిల నిర్వహణపై అక్కడ స్థానికులు కొంతకాలంగా అభ్యంతరం తెలుపుతున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా చర్చిలు నిర్వహిస్తున్నారని, లౌడ్‌స్పీకర్లు వినియోగిస్తున్నారని తెలిపారు. దీనిపై ఎటువంటి స్పందన లేకపోవడంతో హిందూ సంఘాలు ఆందోళన కు పిలుపునిచ్చాయి. హిందూ ధర్మ రక్షా సమి తి రాష్ట్ర అధ్యక్షుడు చేదులూరి గవరయ్య ఆ ధ్వర్యంలో చర్చిల ప్రాంతంలో ఆందోళనకు దిగారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తతలు ఏర్ప డ్డాయి. అదే సమయంలో చర్చిలో ప్రార్థనలు జరుగుతున్నాయి. దీంతో కాకినాడ రూరల్, త్రీటౌన్ సీఐలు చైతన్యకృష్ణ, సత్యనారాయణల ఆధ్వర్యంలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి ఎస్‌ఐలు రామకృష్ణ, మణికుమార్, లోకేష్, వెంకటేష్ అక్కడకు చేరుకున్నారు. హిందూ సంఘాలతో చర్చలు జరిపారు. చర్చిలు మూసివేసే వరకూ ఆందోళన విరమించేది లేదంటూ గవరయ్య స్పష్టం చేశారు. చర్చిల్లో ఉన్న వారిని బయటకు పంపివేశారు. కొంత సమయం తర్వాత క్రైస్తవులు అక్కడకు చేరుకునేందుకు గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయం నుంచి తరలివచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు నిలువరించారు.

ఆర్డీవో చర్చలు

విషయం తెలుసుకున్న కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, గొల్లప్రోలు తహశీల్దార్ రామ్‌కుమార్, నగరపంచాయతీ టీపీవో దీప్తి కొత్తపేటకు చేరుకున్నారు. ఇరువర్గాలతో చర్చలు జరిపారు. చర్చిలకు అనుమతులు లేవని, ఆక్రమణలు ఉన్నాయని హిందూ సంఘాల ప్రతినిధులు ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ ప్రాంతంలో ఉన్న రెండు చర్చిలను తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశించారు. అదేవిధంగా కొత్తపేట ప్రాంతంలో సీఆర్‌పీసీ 144వ సెక్షన్ కింద నిషేదాజ్ఞలు విధించారు. ఆక్రమణలు ఉన్నాయన్న ఫిర్యాదుల మేరకు సర్వే నిర్వహించి మార్కింగ్ చేయాలని టీపీవోను ఆర్డీవో ఆదేశించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలో చర్చిల నిర్వాహకులతో చర్చలు జరిపారు. కలెక్టర్‌ను సోమవారం కలవాలని సూచించారు. మరోవైపు ఆర్డీవో హామీతో హిందూ సంఘాలు ఆందోళన విరమించాయి. అక్కడ ఏ ఇబ్బందులు రాకుండా ఉండేందుకు గానూ ముందుజాగ్రత్త చర్యగా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.



చర్చిల నిర్వాహకులతో చర్చలు జరుపుతున్న ఆర్డీవో

మన్యంలో పెరిగిన చలి

మోతుగూడెం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మన్యం ప్రాంతంలో చలి తీవ్రత పెరిగింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు మంచు దట్టంగా కమ్ముకుంటుంది. మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో మంచు దెబ్బకు వాహనాలు నెమ్మదిగా ప్రయాణించవలసి వస్తుంది. చలి తీవ్రతంగా కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందిపడుతున్నారు. అయితే మంచులో అందమైన దృశ్యాలు కనిపించడంతో పలువురు కెమెరాలతో ఇక్కడ షూటింగ్‌లు చేస్తున్నారు.





మోతుగూడెం- పొల్లూరు మార్గంలో పొగమంచు దృశ్యాలు

నేడు, రేపు 'నన్నయ'లో జాతీయ కార్యశాల

హాజరుకానున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

దివాన్‌చెరువు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సోమ, మంగళవారాల్లో భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం అనే అంశంపై జాతీయ కార్యశాలను నిర్వహిస్తున్నట్టు వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. ఆదివారం విలేకర్లతో వీసీ మాట్లాడుతూ భారతీయ భాషా సమితి, న్యూఢిల్లీలోని విద్యామంత్రిత్వశాఖ సహకారంతో ఈ కార్యశాలను నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం ముఖ్యఅతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరై జాతీయ కార్యశాలను ప్రారంభిస్తారని చెప్పారు. ఆత్మీయ అతిథులుగా ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షుడు ఆర్‌డి.విల్సన్, భారతీయ భాషా సమితి సీనియర్ ఎక్స్‌పర్ట్ ఆచార్య ఆర్‌ఎస్.సర్రాజు, తానా సాహితీ వేదిక అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, భారతీయ భాషాసమితి అకడమిక్ కోఆర్డినేటర్ కె.గిరిధరరావు దేశ నలుమూలల నుంచి తెలుగు, సంస్కృత భాషల ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలంపై మరింత అవగాహన పెంచుకునేందుకు విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీకళాశాలల తెలుగు, హిందీ, సంస్కృతం అధ్యాపకులు, పాఠ్య పుస్తకాలు రచించిన విద్యావేత్తలు, భాషాభిమానులు ఈ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని సూచించారు. కార్యశాల కోఆర్డినేటర్‌గా తలారివాసు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా కె.వరప్రసాద్, పి.రాజశేఖర్, ఎన్.నారాయణ, ఎం.రమేష్, ఆనంద్ వ్యవహరిస్తారని తెలిపారు.

అరగంటసేపు భయం భయం...

- ఎక్సలేటర్ వైరు తెగి గోదావరిలో నిలిచిపోయిన పంటు
- ప్రయాణికుల బెంబేలు
- మరో పంటు సాయంతో క్షేమంగా ఒడ్డుకు

అంతర్వేది, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి-నర్సాపురం వశిష్ట గోదావరి రేవు మధ్యలో ప్రయాణికులతో వెళ్తున్న పంటు ఆదివారం అరగంటసేపు నిలిచిపోయింది. పంటుకు ఉన్న ఎక్సలేటర్ వైరు తెగి ప్రయాణికులు వాహనాలతో ఆగిపోవడంతో భయాందోళన చెందారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నుంచి సఖినేటిపల్లి రేవుల మధ్య నిత్యం వేలాది మంది పంటుపై ప్రయాణాలు సాగిస్తుంటారు. ఆదివారం ఉదయం పంటు గోదావరిలో నిలిచిపోవడంతో వేరే పంటు సాయంతో నిలిచిపోయిన పంటును ఒడ్డుకు తీసుకువచ్చారు. సఖినేటిపల్లి రేవులో గోదావరిపై అంతర్వేది సాగర సంగమం నుంచి వచ్చే ఆటుపోట్ల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. నిలిచిపోయిన పంటు స్థిరంగా ఉండక పాటు సమయం కావడంతో నెమ్మదిగానే కదలిక సాగింది. అదే పోటు సమయంలో అయితే పంటు వేగానికి అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సుమారు 80 మంది ప్రయాణికులు, సుమారు 20 దిచక్రవాహనాలు, ఒక కారు పంటులో ఉన్నాయి. పంటును ఒడ్డుకు తీసుకు రావడంతో వీరంతా ఊపిరి పీల్చుకున్నారు.



సఖినేటిపల్లి రేవులో పంటును వేరే పంటు సాయంతో ఒడ్డుకు తీసుకెళ్తున్న దృశ్యం

ధాన్య పరమేశ్వరుడిగా రామలింగేశ్వరస్వామి

ధాన్యం, వరి కంకులతో అలంకారం





స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో కొలువైన పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి ధాన్యపరమేశ్వరుడి అలంకారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు నిర్వహించారు. వరి కంకులు, ధాన్యంతో ధాన్య పరమేశ్వరుడిగా అలంకారం చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. రైతులు పండించే ఆహార ధాన్యాల పంటలు సక్రమంగా చేతికందాలని కోరుతూ ఈ అలంకారం చేసినట్టు ఆలయ సేవాసమితి సభ్యులు తెలిపారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక

అమలాపురం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమంలో ఆదివారం మోటూరి భైరవస్వామి ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగా గురువు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాస్థాయిలో విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి 3 స్థానాల్లో నిలిచిన వారిని విజేతలుగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత, నేషనల్ యోగా జడ్జి మోటూరి భైరవస్వామి ప్రకటించారు. జాతీయస్థాయిలో జరిగే పోటీలకు 8మందిని ఎంపిక చేసినట్టు వివరించారు. సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో బి.మధు, ఎన్.శ్రావణి, కె.సురేంద్ర, ఎం.అనిల్‌కుమార్, ఎ.ప్రవల్లిక, కె.దుర్గాభవానీ, సీహెచ్.నరేంద్రకుమార్, పి.హర్షవర్ధన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రథమస్థానం సాధించిన విద్యార్థులు పంజాబ్‌లో జరిగే జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఈనెల 28న రాజమహేంద్రవరంలో జరిగే పోటీలకు పంపనున్నట్టు తెలిపారు.



పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో యోగా గురువు భైరవస్వామి

స్కూల్‌గేమ్స్‌లో యానాం విద్యార్థుల ప్రతిభ

యానాం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి విద్యాశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న స్టేట్ స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్ 2025-26 పోటీల్లో యానాం విద్యార్థులు ప్రతిభ సాధించారు. వెయిట్ లిఫ్టింగ్ 53 కిలోల విభాగంలో యానాం విద్యార్థిని సీహెచ్.మహాశరణ్య ప్రథమస్థానం, 48 కిలోల విభాగంలో వి.ఎల్.ధనశ్రీ, 44కిలోల విభాగంలో ఎమ్.సూర్యకార్తీ, 98 కిలోల విభాగంలో ఎం.సురేష్ తృతీయస్థానం కైవసం చేసుకున్నారు. బాలురు అండర్ 17వాలీబాల్ విభాగంలో ద్వితీయస్థానం కైవసం చేసుకున్నారు.



వాలీబాల్ విభాగంలో ప్రతిభ సాధించిన యానాం విద్యార్థులు

పంటకాల్వలోకి దూసుకెళ్లిన కారు

యువకుడి మృతి



శ్యామ్‌తేజ (ఫైల్)

రాజోలు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం కడలిలో పంట కాల్వలోకి ఆదివారం కారు దూసుకెళ్లడంతో శ్యామ్‌తేజ (20) మృతిచెందాడని రాజోలు ఎస్‌ఐ బి.రాజేష్‌కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం.. ములికిపల్లికి చెందిన కలిగితి శ్యామ్‌తేజ కారులో పి.గన్నవరం వెళ్లి ములికిపల్లికి వస్తుండగా కడలి పెట్రోలు బంకు సమీపంలోకి వచ్చేసరికి కారు అదుపుతప్పి పల్టీలు కొడుతూ పక్కనే ఉన్న ప్రధాన పంటకాల్వలోకి దూసుకెళ్లడంతో శ్యామ్‌తేజ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు నాగేంద్రబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.



పంటకాల్వ నుంచి బయటకు తీసిన కారు

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

పెద్దాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష పట్టణంలో ఆదివారం ప్రశాంతంగా జరిగిందని డీవైఈవో ఈరంకి ప్రభాకరశర్మ తెలిపారు. పట్టణ పరిధిలోని 9 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. 2075 అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 1990 మంది హాజరయ్యారని, 85 మంది గైర్హాజయ్యారని డీవైఈవో చెప్పారు.

భవన నిర్మాణ కార్మికుల ఆందోళన పోస్టర్లు ఆవిష్కరణ

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కచేరీపేటలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆదివారం భవన నిర్మాణ కార్మికుల ప్రచార ఆందోళనకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ వరకు ప్రచార ఆందోళన నిర్వహిస్తామన్నారు. 15న రాష్ట్రంలోని కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు జరుపుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆదినారాయణమూర్తి, రాఘవులు, జనుపల్లి సత్తిబాబు, శ్రీపాదం సత్తిబాబు, కృష్ణ, రాము, పులగల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం అదనపు ఎస్ఐగా లోకేష్



పిఠాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణ అదనపు ఎస్ఐగా డి.లోకేష్ బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ రూరల్ ఇంద్రపాలెం స్టేషన్లో ట్రైనీ ఎస్ఐగా విధులు నిర్వర్తించిన ఈయన్ను పిఠాపురంలో నియమిస్తూ ఎస్పీ బిందుమాధవ్ ఉత్తర్వులు జారీ చేశారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్‌ను లోకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు.



వైసీపీ హయాంలో కనీస మరమ్మతులకు నోచుకోక గోతులతో అధ్వానంగా ఉన్న పిఠాపురం-నరసింగపురం-జములపల్లి-గోకివాడ రహదారి



ప్రయాణం సాఫీగా...

పిఠాపురం-జములపల్లి-గోకివాడ రోడ్డుకు మోక్షం

వైసీపీ ప్రభుత్వ హయాంలో గోతులు... ఇప్పుడు మరమ్మతులు నిర్వహించి అభివృద్ధి

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో కనీస మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా వున్న రహదారులకు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మోక్షం లభిస్తోంది. గోతులు పూడ్చి మరమ్మతులు చేపట్టంతో రోడ్ల రూపురేఖలు మారి ప్రయాణం సాఫీగా సాగుతోంది. పిఠాపురం-నరసింగపురం-జములపల్లి-గోకివాడ-బి.కొత్తూరు మధ్య రహదారి ఎనిమిది కిలోమీటర్లు పొడవునా గోతులు పడి ప్రజలకు ప్రయాణంలో ప్రత్యక్ష నరకం కనిపించేది. వైసీపీ పాలనలో కనీస మరమ్మతులు చేపట్టలేదు. నాడు నిధులు మంజూరు చేసినట్టు ప్రకటించినా బిల్లులు చెల్లించక కాంట్రాక్టర్లు పనుల నిర్వహణకు ముందుకు రాలేదు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక దృష్టిసారించి కాంట్రాక్టరుకు బిల్లుల బకాయిలు చెల్లించేలా చూడటంతో ఈ రోడ్డు పనుల్లో కదలిక వచ్చింది. సుమారు రూ.కోటి వ్యయంతో పిఠాపురం బైపాస్ నుంచి భీమనగర్, నరసింపురం, జములపల్లి గ్రామాల మీదుగా గోకివాడ వరకు మరమ్మతులు నిర్వహించి రహదారిని అభివృద్ధి చేశారు. ఈ పనులు దాదాపు పూర్తికావడంతో ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గోతుల్లేని రహదారులపై ప్రయాణం సాఫీగా సాగిపోతోందంటూ వారు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు చెప్తున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక మరమ్మతులు నిర్వహించి అభివృద్ధి చేసిన అనంతరం ఇలా...





పాదగయలో ప్రత్యేక అలంకరణలో కుక్కుటేశ్వరస్వామి

కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు

పిఠాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రంలో కొలువైయున్న రాజరాజేశ్వరీ సమేత ఉమారామలింగేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం కావడంతో ఉదయం నుంచే భక్తుల రద్దీ అధికంగా ఉంది. కుక్కుటేశునికి తెల్లవారుజామున అభిషేకాలు, పూజల అనంతరం విశేషంగా అలంకరించారు. రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లకు కుంకుమ పూజలు జరిగాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.



బియ్యం, నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

పేదలకు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ

పిఠాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో గల చర్చిలో క్రైస్ట్ ఎవాంజెలికల్ లూథర్న్ మినిస్ట్రీస్, గుంటూరు లూథర్న్ బైబిల్ శిక్షణా కళాశాల పాస్టర్ బి.శామ్యూల్, బి.కుమార్ ఆధ్వర్యంలో 100 మంది పేదలకు ఒక్కొక్కరికి 25 కిలోల వంతున బియ్యం, కిలో కందిపప్పు, కిలో పామాయిల్‌ను ఆదివారం పంపిణీ చేశారు. పిఠాపురం రాజా రావు రామరత్నారావు, వార్డు కౌన్సిలర్ రవి, అర్బన్ సొసైటీ మాజీ చైర్మన్ బాలిపల్లి రాంబాబు, సంఘ సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



ఎంపీపీ సుధను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సత్తిబాబు

కోరం లేకపోయినా బడ్జెట్ ఆమోదం

కొత్తపల్లి మండల సమావేశాన్ని వాకౌట్ చేసిన కూటమి ఎంపీటీసీలు

కొత్తపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య కోరం లేకపోవడంతో నిర్వహణకు నోచుకోలేదు. అయినప్పటికీ సమావేశం నిర్వహించి ఏకపక్షంగా బడ్జెట్‌ను ఆమోదించడంతో కూటమి ఎంపీటీసీలు వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. 2026-27 సంవత్సరానికి అంచనా బడ్జెట్ ఆమోదం కోసం కొత్తపల్లి మండల ప్రజా పరిషత్ సమావేశాన్ని ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ప్రారంభంలో హాజరుపట్టీలో 10మంది ఎంపీటీసీలు సంతకం చేశారు. అయితే తర్వాత ఏడుగురు మాత్రమే ఉండడంతో కొండెవరం ఎంపీటీసీ దుళ్ల సత్తిబాబు కలుగజేసుకుని కనీసం ఎనిమిది మంది ఉండాలని, ఏడుగురితో ఎలా నిర్వహిస్తారని ఎంపీడీవో లక్ష్మీరెడ్డిని ప్రశ్నించారు. హాజరు పట్టీలో సంతకాలే ముఖ్యమని, సభ్యులు ఉండాల్సిన అవసరం లేదని ఆయన బదులిచ్చారు. దీంతో కూటమి ఎంపీటీసీలు దుళ్ల సత్తిబాబు, జి.వీరనాగేశ్వరరావు, రాయుడు విష్ణుమూర్తి, దాకే నాగమహేశ్వరిరాజకుమార్ వాకౌట్ చేసి సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. అనంతరం కోరం లేకపోయినప్పటికీ వైసీపీ ఎంపీపీ సుధ అధ్యక్షతన ఎంపీడీవో లక్ష్మీరెడ్డి తూతూమంత్రంగా సమావేశం నిర్వహించి ఏకపక్షంగా బడ్జెట్‌ను ఆమోదించడం విశేషం. వైస్ ఎంపీపీలు చెట్టుబత్తిన సురేష్‌కుమార్, మాదిరెడ్డి దొరబాబు, అధికారులు పాల్గొన్నారు.

'వైసీపీ వర్గానికి ఎంపీడీవో మద్దతా'



ఎంపీడీవో తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీటీసీలు

కొత్తపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ కొత్తపల్లి ఎంపీడీవో లక్ష్మీరెడ్డి వైసీపీ ఎంపీపీ వర్గానికే మద్దతు ఇవ్వడంపై కూటమి ఎంపీటీసీలు ఆందోళన చేపట్టారు. కొత్తపల్లి మండల పరిషత్ సమావేశం అనంతరం బయటకు వచ్చి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎంపీటీసీలు దుళ్ల సత్తిబాబు, దాకే నాగమహేశ్వరీరాజకుమార్, పిఠాపురం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గాది రాజబాబు మాట్లాడారు. తమ గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధుల మంజూరు విషయంలో వైసీపీ ఎంపీపీ చులకనభావంతో వ్యవహరిస్తున్నారన్నారు. వైసీపీ అధికారంలో ఉండగా తమపై ఆ పార్టీలోకి రావాలని ఒత్తిడి తెచ్చేవారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా నిధుల విషయంలో చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారిగా సమన్యాయం చేయాల్సిన ఎంపీడీవో నేటికీ వైసీపీ ఎంపీపీకి అనుకూలంగా వ్యవహరించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్‌లో ఎంపీటీసీలకు కేటాయించాల్సిన పనులను కమీషన్ పద్ధతిపై పిఠాపురం కాంట్రాక్టరుకు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.





కాకినాడ, సామర్లకోటల్లో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

320 మందికి నేత్ర వైద్య పరీక్షలు

కాకినాడ సిటీ/కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 36వ డివిజన్ పగోడా స్కూలు ప్రాంగణంలో ఆదివారం టీడీపీ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాసు, తులసి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీసూర్య ఐకేర్, ఏఎల్ ఫౌండేషన్ సిబ్బంది 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు అందజేశారు. ఆసుపత్రి ఎండీ రామ్‌ప్రకాష్, బిజినెస్ హెడ్ మేడూరి శేషు, టీడీపీ నాయకులు సాయిబాబా, నెక్కంటి శ్రీనివాసు, గ్రంధి బాబ్జీ, చింతా పేర్రాజు, నేమాని సత్యనారాయణ, శివరామకృష్ణ, సాయిచౌదరి, గిరి, కుమారస్వామి, బలరాం, ఆకెళ్ల ప్రసాద్, శ్రీకృష్ణ, వీరబాబు, వీరభద్రరావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుస్సేన్‌పురం పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్ ప్రారంభించారు. టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చల్లా బుజ్జి ఆధ్వర్యంలో కిరణ్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది సుమారు 120 మందిని పరీక్షించారు. 30 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించి ప్రత్యేక వాహనాల్లో కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రికి తరలించారు. సుమారు 76 మందికి ఉచితంగా కళ్లజోళ్లు ఇస్తామని శిబిర నిర్వాహకుడు బుజ్జి తెలిపారు. కోట అప్పారావు, తలారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం



పెద్దాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ దేవస్థానంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. సుమారు 500 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి తెలిపారు. నిత్యాన్నదాన పథకానికి దాతలు సహకరించాలని ఆమె కోరారు.



పెద్దాపురంలో విజేతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు



కాకినాడలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

భగవద్గీత పోటీలకు విశేష స్పందన

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో నగరంలోని గిల్డ్ ఆఫ్ సర్వీస్ పాఠశాలలో ఆదివారం భగవద్గీత శ్లోకాల ప్రఖండ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ సీనియర్ నేత, రాష్ట్ర భవన నిర్మాణ కమిటీ సభ్యుడు ఇంజనీర్ గట్టి సత్యనారాయణ విద్యార్థుల్లో సంస్కృతీ, సంప్రదాయాలపై అవగాహన పెరగాల్సిన అవసరాన్ని వివరించారు. 2047 నాటికి భారత్‌ను విశ్వగురువుగా తీర్చిదిద్దే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పాన్ని నెరవేర్చాలంటే చిన్నారులను ధర్మ మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. వీహెచ్‌పీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం సహా గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 18 ప్రఖండలు నిర్వహించగా 2,500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. గ్రామీణం నుంచి నగర స్థాయి వరకు విజేతలు ఈ నెల 14న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని, 25న విజయవాడలో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా సహ కార్యదర్శి బొడ్డు వెంకటదుర్గవర్మ, జి.ఉదయభానోజీరావు, చల్లా శ్రీకృష్ణవేణి, సునీత, గాబు శ్రీదేవి, పప్పు లక్ష్మణరావు, మన్నార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజుగారి వీధిలో గల ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వేద శాస్త్ర ట్రస్టు ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) బహుమతులు అందజేశారు. వేదశాస్త్ర ట్రస్టు చైర్మన్ చిట్టెం హరిగోపాలశర్మ, జనసేన పట్టణ శాఖ అధ్యక్షుడు పోలమరశెట్టి సత్తిబాబు, రావులపర్తి విజయ్, తిరువెంగళాచార్యులు, ఖండవిల్లి సూర్యనారాయణ, తమ్మన శ్రీనివాసరావు, జిగిని రాజేష్‌ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో నేడు పీజీఆర్ఎస్

పిఠాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బస్టాండు వద్ద గల పాడా కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమ వినతులు, అర్జీలు అందించవచ్చని చెప్పారు. అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాఘవేంద్రరావు

'శ్వాసకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి'

సర్పవరం జంక్షన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చలి తీవ్రత దృష్ట్యా శీతాకాలంలో శ్వాసకోశ వ్యాధుల పట్ల వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని విశ్రాంత డీఎంఈ డాక్టర్ ఎం.రాఘవేంద్రరావు కోరారు. ఆదివారం బోట్ క్లబ్ పార్కులో జిల్లా సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జలుబు, దగ్గు, చర్మం పొడి బారడం, కీళ్లనొప్పులు సంభవించే అవకాశం ఉందన్నారు. గోరువెచ్చని నీటితో స్నానం చేయడం, రోగ నిరోధకశక్తిని పెంచే ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఈ కాలంలో స్క్రబ్ టైఫస్ అనే నల్లిని పోలిన కీటక ప్రభావం కూడా అధికంగా ఉంటుందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి అడబాల రత్నప్రసాదరావు, బి.సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష కేంద్రాల తనిఖీ

కాకినాడ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, పెద్దాపురం డివిజన్ల పరిధిలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష కేంద్రాలను డీఈవో పి.రమేష్ తనిఖీ చేశారు. ఆదివారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. 4,578 మంది విద్యార్థులకు ఏర్పాట్లు చేయగా 4,378 మంది హాజరయ్యారు. 95.63 శాతం నమోదు అయ్యింది.



ప్రభుత్వ లెక్చరర్ల సంఘం జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కృష్ణ

కాకినాడ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం (జీజేఎల్ఏ) కాకినాడ జిల్లా నూతన అధ్యక్షుడిగా డాక్టర్ వీవీ కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కాకినాడ పీఆర్ ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలలో ఎన్నికల అధికారి బి.చక్రవర్తి ఆధ్వర్యంలో జీజేఎల్ఏ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎంసీహెచ్ శ్రీనుబాబు, ప్రధాన కార్యదర్శిగా జి.ధన కృష్ణారావు, సహాయ కార్యదర్శిగా బి.శివకృష్ణ, కోశాధికారిగా జి.లక్ష్మీనారాయణ, మహిళా కార్యదర్శిగా కె.శ్రీలక్ష్మి, రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎస్‌వీ ప్రేమకుమారి ఎన్నికయ్యారు. వారిని పలువురు అభినందించారు.

'స్థానిక ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యం'



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

పిఠాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సూర్యారాయ విద్యానంద గ్రంథాలయ ఆవరణలో బీజేపీ పట్టణ కమిటీ సమావేశం జరిగింది. నాయకులు మాట్లాడుతూ ఏయే వార్డుల్లో పోటీ చేయాలనే అంశంపై అందరి అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. అన్ని వార్డుల్లో పార్టీ బలోపేతంపై చర్చించారు. బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ఓలేటి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సైతన సత్యకుమారి, నాయకులు బుర్రి మురళీధరరావు, పసుపులేటి సత్యనారాయణ, కర్నీడి తాతీలు, అల్లుబోయిన సూరిబాబు, కంబాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చాంపియన్స్ లీగ్ ట్రోఫీని ప్రారంభిస్తున్న టీడీపీ నేత తూతిక రాజు

'క్రీడా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి'

పెద్దాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని టీడీపీ పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి తూతిక రాజు కోరారు. స్థానిక వీర్రాజు హైస్కూల్ ఆవరణలో పెద్దాపురం చాంపియన్స్ లీగ్ క్రికెట్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలపై యువత మక్కువ పెంచుకోవాలన్నారు. నిర్వాహకులు సాయినాగేంద్ర, భీమసాయి మాట్లాడుతూ 16 రోజుల పాటు జరిగే పోటీల్లో పది జట్లు పాల్గొంటున్నాయన్నారు. మొదటి బహుమతి రూ.30వేలు, ట్రోఫీ, రెండో బహుమతి రూ.20వేలు, ట్రోఫీ, మూడో బహుమతి రూ.10 వేలు, ట్రోఫీ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిగిని రాజేష్‌ఖన్నా, వీర్రాజు హైస్కూలు హెచ్ఎం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న లోకమయానంద స్వామీజీ

స్టడీ మెటీరియల్ పంపిణీ

సామర్లకోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణ ధ్యాన మందిరం, యూటీఎఫ్ సంయుక్తంగా సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను వేట్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు రాజమహేంద్రవరం రామకృష్ణ మఠానికి చెందిన లోకమయానంద స్వామీజీ ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వివేకానంద ట్రస్టు సభ్యులు కంటిపూడి గోపాలకృష్ణ, కంటిపూడి బలరాం, హెచ్ఎం అనూరాధ, పీడీ యార్లగడ్డ బంగార్రాజు పాల్గొన్నారు.

వేట్లపాలెం మాజీ ఎంపీటీసీ జగన్ మృతి



జగన్ (పాత చిత్రం)

సామర్లకోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేట్లపాలెం మాజీ ఎంపీటీసీ కొప్పిశెట్టి జగన్ (60) ఆదివారం సాయంత్రం మృతి చెందారు. టీడీపీ ఆవిర్భావం నుంచీ కార్యకర్తగా, నాటి ఎమ్మెల్యే బొడ్డు భాస్కర రామారావు అనుచరునిగా పేరొందారు. ఆ పార్టీ తరపున ఎంపీటీసీగా గెలుపొందడమే గాక భార్య అమల వేట్లపాలెం సర్పంచ్ కావడానికి విశేష కృషి చేశారు. ఉన్నత విలువలకు అధిక ప్రాధాన్యమిచ్చే జగన్ పసుపు రంగులో ఉన్న సైకిల్ తొక్కుతూ గ్రామ సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె వున్నారు. జగన్ మృతికి మాజీ జడ్పీటీసీ గుమ్మళ్ల విజయలక్ష్మీరామకృష్ణ, మాజీ ఎంపీపీ కొండపల్లి కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్, మాజీ ఉప సర్పంచ్ వల్లూరి శ్రీనువాసు, నాయకులు యరమాటి రామకృష్ణ, సంగమేశ్వరరావు, గోలి భద్రరావు సంతాపం తెలిపారు.

సాంకేతిక సామగ్రి అందజేత

కాకినాడ సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వివేకానంద పార్కు ఆవరణలోని గాంధీనగర్ శాఖా గ్రంథాలయానికి మంత్రి నారా లోకేశ్ సూచన మేరకు శిక్షణ ఫౌండేషన్ సుమారు రూ.2లక్షలు విలువచేసే కంప్యూటర్లు, స్మార్ట్ టీవీ, స్మార్ట్ ఫోన్లను అందజేసింది. వీటిని ఉపయోగించుకుని విద్యార్థులకు, పాఠకులకు కావలసిన సమాచారం, విజ్ఞానాన్ని అందిస్తామని లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. పౌర గ్రంథాలయ శాఖ సంచాలకుడు ఎ.కృష్ణమోహన్, శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధులకు, జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

వై.రామవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు టీడీపీ నాయకుడు, మాజీ జడ్పీటీసీ పల్లాల వెంకట రమణారెడ్డి తెలిపారు. రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆసుపత్రి సహకారంతో జరిగే శిబిరంలో కంటి, జనరల్ విభాగాల్లో వైద్య సేవలు అందిస్తారని చెప్పారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



ఐటీడీఏ పీవో తరఫున మాట్లాడుతున్న సీసీ దుర్గ

'పరిశ్రమలు నిర్మించాకే నిర్వాసితులను తరలించాలి'

కూనవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాడువాయిలో పరిశ్రమలు నిర్మించాకే తమను పునరావాస కేంద్రాలకు తరలించాలని మండలంలోని టేకులబోరు పోలవరం నిర్వాసితులు అధికారులను కోరారు. ఆదివారం తహసీల్దారు కార్యాలయంలో అధికారులు టేకులబోరు గ్రామానికి చెందిన నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. కొత్త జీవో ప్రకారం నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పరిహారం చెల్లించాలన్నారు. ఒకే కుటుంబానికి చెందిన వారికి ఎన్ని పీడీఎఫ్‌లు ఉన్నా అందరికీ ఒకేచోట పునరావాసం కల్పించాలన్నారు. కాగా సమావేశం అసంపూర్తిగా ముగియడంతో మంగళవారం చింతూరు ఐటీడీఏ పీవో నిర్వాసితులతో మరోసారి సమావేశం నిర్వహించనున్నారు. ఐటీడీఏ పీవో తరఫున సీసీ దుర్గ, తహసీల్దారు ధర్మేంద్ర, ఎంపీడీవో జగన్నాథరావు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎంపీటీసీ వెంకటరమణ, కూటమి నాయకులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

మోతుగూడెం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డొంకరాయి గ్రామానికి చెందిన పోలు మూరి శంకర పార్వతి కుమారుడు సాయితేజకి రెండు నెలల క్రితం కడుపులో తీవ్ర నొప్పి వచ్చింది. వెంటనే భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి శస్త్ర చికిత్స చేయించారు. నిరుపేదరాలైన పార్వతి గ్రామంలో కొందరి వద్ద అప్పులు చేసి వైద్యం చేయించిన విషయాన్ని టీడీపీ నాయకుడు, ఎంపీటీసీ కరకా వెంకటరమణ క్లస్టర్ ఇన్‌చార్జి కరకా ప్రేమకిరణ్ దృష్టికి తీసుకెళ్లాడు. వెంటనే ఆయన స్పందించి నిరుపేద కుటుంబానికి ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం ఇప్పించి ఆదుకోవాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషబాస్కర్‌కు విన్నవించారు. ఆమె వెంటనే స్పందించి చంద్రబాబుకి అందజేయగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.41,084 మంజూరు చేసి చెక్కును ఎమ్మెల్యేకి పంపించారు. దీనిని ఎంపీటీసీ, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు కలిసి డొంకరాయి ఎన్టీఆర్ భవన్ వద్ద పార్వతికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో నీలాపు సత్యనారాయణ, గంగిరెడ్ల గురుమూర్తి, కరకా చిట్టిబాబు, కొల్లూరి నూకరాజు, కందూరి నరసింహమూర్తి, తాళి కోరా, కిముడు మూర్తి, మండి రమేష్, వలల దారబాబు, దుంగా రాజు, పోలు మూరి సాయితేజ, మావూరి శ్రీను, గంపెన శివ, బుట్టి కోటి, నాగూర్‌మీరా తదితరులు పాల్గొన్నారు.



ప్రముఖ సినీ నటుడు సుమన్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో

'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

ఎటపాక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ఖమ్మం సుమన్ చోటకాన్ ఆకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మండలంలోని తోటపల్లి ఆదిత్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 8వ తరగతి విద్యార్థి సాయి అనన్య బ్లాక్ బెల్ట్, 3వ తరగతి విద్యార్థి రోహిత్ సిల్వర్ బెల్ట్, 8వ తరగతి విద్యార్థి దీప్తి బ్రౌన్ బెల్ట్ సాధించారు. వారికి ప్రముఖ సినీ నటుడు సుమన్ ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. విజేతలను పాఠశాల డైరెక్టర్ కడియాల వెంకట్, ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి అభినందించారు.

పాడేరు తరలిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

రంపచోడవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నరసాపురం క్వారీతో నష్టపోతున్న బాధితులకు న్యాయం చేయాలని, వారికి అండగా నిలిచిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులపై దాడికి పాల్పడడాన్ని ఖండిస్తూ సోమవారం పాడేరు కలెక్టరేట్ వద్ద శాంతియుత నిరసన తెలపనున్నట్టు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు తెలిపారు. ఈ మేరకు



ఆదివారం రంపచోడవరం నుంచి ఆదివాసీ సంక్షేమ పరిషత్ బృందం పాడేరు తరలివెళ్లింది. మద్దతు తెలిపేందుకు ఆదివాసీలు తరలి రావాలని మధు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను, తీగల బాబూరావు, మోడిత నూకరాజు, చోడి ఏడుకొండలరావు, ప్రదీప్‌కుమార్‌దొర, ప్రసాద్, పురుషోత్తం, గంగరాజు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

వై.రామవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు టీడీపీ నాయకుడు, మాజీ జడ్పీటీసీ పల్లాల వెంకటరమణారెడ్డి తెలిపారు. రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆసుపత్రి సహకారంతో జరిగే శిబిరంలో కంటి, జనరల్ విభాగాల్లో వైద్య సేవలు అందిస్తారని చెప్పారు.



రథంపై విహరిస్తున్న సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లు

ఘనంగా సత్యదేవుడి రథోత్సవం

అన్నవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు ఆర్జితసేవలో భాగంగా ఆదివారం రథోత్సవం జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తూర్పు రాజగోపురం వద్ద ఉంచిన రథంపై ఆశీనులయ్యారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తుల గోవిందనామ స్మరణలు, పండితుల వేదమంత్రోచ్చరణల మధ్య మూడుసార్లు ప్రదక్షిణ జరిపారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం గావించగా అర్చకస్వాములు హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకుని వెళ్లారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



తిరునాళ్లకు తరలి వస్తున్న భక్తులు

ఘనంగా మురారి దుర్గమ్మ తిరునాళ్లు

గండేపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో మురారి గ్రామ శివారున ఉన్న కనకదుర్గమ్మ తిరునాళ్ల ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చుట్టుపక్కల జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని కుటుంబ సభ్యులతో సహపంక్తి భోజనాలు చేసి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ శివ నాగబాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ అన్ని చర్యలు తీసుకున్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



మెట్టిచింత వద్ద కోతకు గురైన రహదారి

మెట్టిచింత రహదారి అధ్వానం

ప్రత్తిపాడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గోకవరం- ఉలిగోగుల రహదారి అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రహదారి కోతకు గురై ప్రమాదంగా మారింది. సుబ్బారెడ్డిసాగర్ పోర్లు కాలువ వంతెన వద్ద రహదారి దారుణంగా దెబ్బతినడంతో తరచూ ఇక్కడ ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయపడుతున్నారు. గోకవరం-మెట్టిచింత ఉలిగోగుల, ఎరకంపాలెం తదితర గిరిజన గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డులో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి దీన్ని అభివృద్ధి చేయాలని గిరిజనులు కోరుతున్నారు.



ప్రదక్షిణ చేస్తున్న భవానీ భక్తులు

భవానీ భక్తుల గ్రామ ప్రదక్షిణ

వీఆర్ పురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భవానీ దీక్షలు చేపట్టి 40 రోజులు పూర్తికావస్తున్న నేపథ్యంలో భక్తులు ఆదివారం గ్రామ స్నానాలు చేస్తూ పుర వీధుల్లో ప్రదక్షిణ చేశారు. కార్యక్రమంలో బొర్ర నరేష్ కుమార్, శ్రీధర్, అన్నమయ్య, జంపన్న, మహిళా భక్తులు పాల్గొన్నారు.

ముగ్గురి అరెస్టు

రాజవొమ్మంగి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగి గ్రామ శివారులో కొందరు చిత్తులాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్ఐ శివకుమార్ ఆదివారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పోలీసులను చూసిన కొందరు అక్కడి నుంచి పరుగులు తీశారు. ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. పారిపోయిన మరో నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి గాలిస్తున్నట్టు ఆయన తెలిపారు.

లోవలో భక్తుల కోలాహలం

ఆలయానికి రూ.5.56 లక్షల ఆదాయం



తునిరూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం వేకువ జామునే తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా లోవ క్షేత్రానికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల కోలాహలంగా మారింది.ప్రత్యేక క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా కుటుంబ సమేతంగా లోవకు తరలివచ్చిన భక్తులు వసతి గదుల్లో వంటా వార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ఒక్కరోజే ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.5.56 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాథ్ రాజు తెలిపారు.



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

చిన్నారులకు స్వెట్టర్ల పంపిణీ

మోతుగూడెం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆశా స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి సయ్యద్ సుభానీ తన సొంత డబ్బులు రూ.10వేలు వెచ్చించి ఎంసీడీ క్యాంపులోని అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 32 మంది చిన్నారులకు, గ్రామంలోని వృద్ధులకు స్వెట్టర్లు, దుప్పట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా అవసరమైన వారికి వెచ్చటి దుస్తులు ఇచ్చి సహకరించాలని కోరారు.



చిన్నారులకు స్వెట్టర్లు అందజేసిన దృశ్యం

తాగునీరు సరఫరాతో ప్రజల హర్షం

దేవీపట్నం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలం పురుషోత్తపట్నం గోదావరి నుంచి సత్యసాయి మంచినీటి పథకం ద్వారా సుమారు నెల రోజులుగా కాంట్రాక్టరు తాగునీటిని శుద్ధి చేసి ఇవ్వట్లేదు. దీంతో దేవీపట్నం మండలంలోని పునరావాస కాలనీలైన ఇందుకూరు-1, 2, పెదభీంపల్లి-1, 2, 3, నేలకోట, ఎస్.రామన్నపాలెం, కమలంపాలెం, శరభవరం, దేవారం, కొత్త వీధి, ఇందుకూరుపేట, ఇందుకూరు ప్రజలు తాగునీటికి ఇబ్బందిపడ్డారు. ప్రభుత్వం ఇటీవల కాంట్రాక్టరుకు బిల్లులు విడుదల చేయడంతో సత్యసాయి కార్మికులు ఆదివారం తాగునీరు అందించారు. దీంతో ఆయా గ్రామాల గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.



ఇందుకూరు వన్ ఆర్ అండ్ ఆర్ కాలనీలో తాగునీరు తీసుకెళుతున్న గిరిజన మహిళలు

అగ్రహారంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం



కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రౌతులపూడి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్.అగ్రహారంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకుడు బుద్దాల శ్రీనివాసరావు దివంగత నేత వరుపుల రాజా ఆశయ సాధనకు గుర్తుగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. తునికి చెందిన లక్ష్మి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో డాక్టర్ ఆనంద్ మోహన్ కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



బాధితులకు సహాయం అందజేస్తున్న లూథరిన్ సంస్థ ప్రతినిధులు

ప్రత్తిపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాచపల్లి క్రైస్తవ ప్రార్థనా మందిరం వద్ద ఆదివారం పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. మొంథా తుఫాన్ వల్ల అవస్థలు పడుతున్న ఒమ్మంగి, రాచపల్లిలోని పేద కుటుంబాలకు క్రైస్ట్ వివేజిలికల్ లూథరిన్ సంస్థ ప్రతినిధులు బియ్యం, పప్పులు, నూనె అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ మర్రి వెంకట్రావు, డేగల అంజుబాబు, తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో జోషితకు కాంస్యం



కాంస్య పతకం సాధించిన జోషిత

ప్రత్తిపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరాటే పోటీల్లో ప్రత్తిపాడు అఖిల్ స్కూల్ విద్యార్థిని కాంస్య పతకం సాధించింది. అనపర్తిలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో అఖిల్ టాలెంట్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న దొడ్డి జోషిత కాంస్య పతకం సాధించినట్టు స్కూల్ చైర్మన్ ఇనకోటి గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని, కరాటే మాస్టరు బుజ్జిలను అఖిల్ సంస్థల అధినేతలు గంగాధర్, సునీత అభినందించారు.కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి నాగశ్రీ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చినశంకర్లపూడిలో శివుడి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

ప్రత్తిపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చినశంకర్లపూడిలోని శ్మశానవాటికలో ఆదివారం శివుని విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. స్థానికులు ఏపూరి సత్యనారాయణ, సూరీడు దంపతులు సమకూర్చిన శివుని విగ్రహాన్ని సగర శ్మశానవాటికలో పట్నాల వెంకటేశ్వరరావు, ఏపూరి రాంబాబు ప్రతిష్ఠించి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బుర్రి శేషయ్య, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

సనాతన సంప్రదాయాలు తెలియజేయాలి

● అన్నమయ్య కళాక్షేత్రం రాష్ట్ర అధ్యక్షుడు సానా



ప్రత్తిపాడులో ప్రసంగిస్తున్న సానా

ప్రత్తిపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే బాలలకు సనాతన సంప్రదాయాలను తెలియజేయాలని అన్నమయ్య కళాక్షేత్రం రాష్ట్ర అధ్యక్షుడు సానా నూకరాజు నాయుడు చెప్పారు. ప్రత్తిపాడులోని మున్సిబ్ వారి రామాలయం వద్ద ఆదివారం సాయ అన్నమయ్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో సర్వతోముఖ వికాస శిక్షణ తరగతులు నిర్వహించారు. వీటిని అన్నమయ్య క్షేత్రం రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు కాళి ప్రసన్నానంద మాతాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ హైందవ సంస్కృతిని దశదిశలా చాటేందుకు అన్ని వర్గాల ప్రజలు నడుం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో కాకినాడ ఎస్ఆర్ రాజేశ్వర స్వామిజీ, జిల్లా సమన్వయకర్త దిడ్డి సునీత, జిల్లా కమిటీ సభ్యులు సిద్దా రామచంద్రరావు, అద్దేపల్లి రాజా, పైలా అప్పలనాయుడు, దాసరి సూర్యనారాయణరావు, బావిశెట్టి వెంకట్రావు, కడారి శ్రీనివాసరావు, ఎన్.నాగేశ్వరరావు, కోరుకొండ కుమారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ (ఎంఎల్ లిబరేషన్) రాష్ట్ర కార్యదర్శిగా బంగార్రావు

ప్రత్తిపాడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా బుగతా బంగార్రావు వరుసగా రెండో సారి ఎన్నికయ్యారు. కడప నగరంలో రెండు రోజులు పాటు జరిగిన లిబరేషన్ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 39 మందిని రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరిలో బంగార్రావు ఒకరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు, ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. బంగార్రావును జాతీయ కార్యదర్శి దీపాంకర్ బట్టాచార్య, పొలిట్‌బ్యూరో సభ్యుడు స్వదేశ్ బట్టాచార్య, రాష్ట్ర పరిశీలకుడు శంకర్, చంద్రమోహన్, మానుకొండ లచ్చబాబు అభినందించారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు సరుకులు

ప్రత్తిపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెద్దిపాలెంలోని నాలుగు అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం అందజేశారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు ఎస్ఏఎఫ్ రూ.70 వేలు నగదు, రూ.20 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. శనివారం వేకువజామున జరిగిన ఈ అగ్నిప్రమాదంలో 3 తాటాకిల్లు పూర్తిగా దగ్ధమై, ఒక డాబా ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. బాధితులకు వాసంశెట్టి వెంకటరమణ సాయం అందజేశారు. అలాగే నాలుగు కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో రీసు సత్తిబాబు, రాళ్ల సీతారాం, వాసంశెట్టి సూర్యఅర్జున్, చిన్న, చందు, విత్తనాల నాగేశ్వరరావు, ఎస్ఏఎఫ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



పెద్దిపాలెంలో సరుకులు అందజేస్తున్న ఎస్ఏఎఫ్ సంస్థ ప్రతినిధులు

అరుణాచలేశ్వరుడికి ఆరుద్ర పూజలు



పలు రకాల పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించిన దృశ్యం

ప్రత్తిపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి అడ్డురోడ్డు వద్ద అరుణాచల క్షేత్రంలో ఆదివారం అరుణాచలేశ్వరుడికి ఆరుద్ర నక్షత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే అపీత కుంచాబ అరుణాచలేశ్వరుడికి అర్చనలు, మహా హారతులు నిర్వహించారు. బసవేశ్వరునికి అభిషేకాలు, పంచహారతులు ఇచ్చారు. ఆలయ వ్యవస్థాపకుడు స్వామి రామానంద ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సహకార ఉద్యోగుల నిరసన



లింగంపర్తిలో నిరసన చేస్తున్న సొసైటీ ఉద్యోగులు

ఏలేశ్వరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలంటూ సొసైటీ ఉద్యోగులు ఆదివారం నిరసన చేపట్టారు. సీఐటీయూ మండల కార్య నిర్వాహక కమిటీ కన్వీనర్ ఉప్పలపు విజయకుమార్ రాజు మాట్లాడుతూ సానుకూలంగా నెల రోజుల పాటు ఆందోళనకు పిలుపునిచ్చిన ఉద్యోగులు తమ విధులకు హాజరవుతూనే నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారన్నారు. సోమవారం రాష్ట్రం వ్యాప్తంగా ఉన్న డీసీసీబీ బ్రాంచిల ఎదుట సహకార సంఘాల ఉద్యోగులు ధర్నా నిర్వహిస్తారన్నారు.

ఎన్‌హెచ్ఆర్‌సీ సభ్యుడిగా వెంకటరమణ



వాగు వెంకటరమణ

ఏలేశ్వరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాను జాతీయ మానవ హక్కుల కమిటీ సభ్యుడిగా నియమితమైనట్టు చిన్నింపేట గ్రామానికి చెందిన వాగు వెంకటరమణ ఆదివారం తెలిపారు. ఈ మేరకు కోల్‌కత్తా ఎన్‌హెచ్ఆర్‌సీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేసినట్టు చెప్పారు. మానవ హక్కులపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా బోస్



పైల సుబాష్‌చంద్రబోస్

ఏలేశ్వరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తనను రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ఆదివారం పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్టు ఏలేశ్వరానికి చెందిన పైల సుబాస్‌చంద్రబోస్ తెలిపారు. తన నియామకం పట్ల బీజేపీ రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బోస్‌కు పలువురు అభినందనలు తెలిపారు.